మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition

దగా.. మోసం!

జనసైనికులకు సొంత నాయకత్వమే వెన్నుపోటు!

40 శాతం పదవులంటూ ఊరించిన జనసేన నాయకత్వం

> స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే స్థానాలపై జనసేన కేడర్ రగిలిపోతోందా? ఆశించిన మేరకు స్థానాలు దక్కడం లేదన్న ఆవేదన పెల్లుబుకుతోందా? 40 శాతం పదవులు దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేసిన జనసేన నాయకత్వం.. సీఎం చంద్రబాబుతో చర్చల తర్వాత యూటర్న్ తీసుకుని ఇచ్చిందే చాలన్నట్లుగా పరిస్థితి మారిపోయిందా? మంత్రి లోకేష్ గతంలో చెప్పిన 80, 15, 5 శాతం సీట్ల లెక్కలే నిజమయ్యాయా? ఫైనల్ లెక్క అదేనా? అంటే లోకేష్ చెప్పిందే శాసనం అయ్యిందా? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం వినిపిస్తోంది.

- చంద్రబాబుతో చర్చల తర్వాత ఒక్కసారిగా మారిన స్వరం
- 40.1 శాతం వాటా.. 2,091 పదవుల డిమాండ్ ఏమైంది?
- లోకేష్ చెప్పిన 80:15:5 ఫార్ములానే ఫైనల్ గా అమలు
- జనసేన ప్రతిపాదనలకు విలువ లేదా? చినబాబు మాటే శాసనమా?
- అసెంబ్లీ ఎన్నికల్లో త్యాగం.. స్థానిక ఎన్నికల్లోనూ అదే రిపీట్!
- ఏలూరు మేయర్ పీఠంపై టీడీపీ, జనసేన మధ్య పంచాయితీ
- కాకినాడ జిల్లాలో సీట్ల సర్దుబాటుపై తెలుగు తమ్ముళ్ల అసంతృప్తి
- బలం ఉన్న ప్రతిచోటా పోటీ చేస్తామన్న పవన్ మాటలేమయ్యాయి?
- జెండాలు మోసేందుకేనా జనసైనికులు?.. కేడర్‌లో పెరుగుతున్న అసహనం

రగిలిపోతున్న కేడర్..

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పొత్తుల వేళ ఏపీ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు రేగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో త్యాగం చేశామంటూ వస్తున్న వాదనలకు, తాజాగా స్థానిక ఎన్నికల్లో సీట్ల పంపకాలకు పొంతన కుదరకపోవడంతో జనసేన శ్రేణుల్లో తీవ్ర ఆవేదన, ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నాయి. 40 శాతం పదవులు, 2,091 స్థానాలు అంటూ సోషల్ మీడియాలో హోరెత్తించిన ఆ పార్టీ నాయకత్వం, చంద్రబాబుతో భేటీ తర్వాత ఒక్కసారిగా ప్లేట్ మార్చడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో వెనక్కి తగ్గాం.. ఇప్పుడు కార్యకర్తల ఎన్నికల్లో కూడా అదే జరిగితే పార్టీ ఎప్పటికీ ఎదుగుతుంది? అంటూ జనసేన కేడర్ రగిలిపోతోంది.

02

జనసేన.. ఆవేదన

1 40 శాతం నినాదం గాలికి:
పట్టణ స్థానిక సంస్థల్లో 40.1 శాతం వాటా (2,091 పదవులు) కోరుతూ జనసేన మంత్రి కందుల దుర్గేష్ సహా ఆ పార్టీ అధికారిక ఎక్స్ ఖాతా, నేతలు, కార్యకర్తలంతా సోషల్ మీడియాలో పోస్టర్ విడుదల చేయడం పెద్ద కలకలం రేపింది.

2 అర్ధరాత్రి చర్చలు.. యూటర్న్:
సీఎం చంద్రబాబుతో రెండు రోజుల పాటు సాగిన సుదీర్ఘ చర్చల అనంతరం జనసేన నేతలు చేసిన ప్రకటన కేడర్‌ను తీవ్ర నిరాశకు గురిచేసింది.

3 లెక్కలే లేవన్న బొలిశెట్టి:
ఇన్ని స్థానాలు కావాలనే లెక్కలేమీ వేసుకోలేదని, ఏకాభిప్రాయం కుదిరిందని జనసేన ఎమ్మెల్సీ బొలిశెట్టి శ్రీనివాస్ చెప్పడంపై జనసైనికులు భగ్గుమంటున్నారు.

4 లోకేష్ మాటే శాసనమా?:
కూటమిలో టీడీపీదే చెల్లుబాటు అవుతోందని, లోకేష్ చెప్పిందే శాసనంగా మారిందంటూ జనసేన సోషల్ మీడియాలో, కేడర్‌లో తీవ్ర చర్చ నడుస్తోంది.

5 పార్టీ శ్రేణుల తిరుగుబాటు:
"ఇంకెంత కాలం తగ్గి ఉండాలి? అన్ని స్థానాల్లో పోటీ చేస్తే పోతుంది కదా" అంటూ జనసైనికులు బహిరంగంగానే తమ నాయకత్వాన్ని నిలదీస్తున్నారు.

6 టీడీపీలోనూ అసంతృప్తి:
మెజారిటీ ఓటు బ్యాంకు ఉన్న తమతో సమానంగా జనసేన పదవులు అడగడం ఏంటని టీడీపీ నేతలు కూడా మండిపడుతున్నారు.

7 మభ్యపెట్టేందుకేనా ప్రచారం?:
సీట్ల పంపకాలపై జరుగుతున్న చర్చలన్నీ కేవలం కార్యకర్తలను మభ్యపెట్టడానికేనని రాజకీయ విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు.

8 కూటమి ధర్మంపై హెచ్చరికలు:
పెద్దాపురం సహా పలు ప్రాంతాల్లో కూటమి ధర్మం పాటించకుంటే ఒంటరిగా పోటీకి దిగుతామని జనసేన స్థానిక నేతలు హెచ్చరిస్తున్నారు.

9 సోషల్ మీడియాలో వార్:
ఇరు పార్టీల కార్యకర్తల మధ్య ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మాటల యుద్ధం తారస్థాయికి చేరింది.

10 ఫైనల్ ఫార్ములా ఇదేనా?:
చివరకు లోకేష్ చెప్పినట్లుగానే 15 శాతం జనసేన, 5 శాతం బీజేపీ, 80 శాతం టీడీపీ అనే నిష్పత్తిలోనే సీట్ల కేటాయింపు ఫైనల్ అయిందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

